ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



డాక్టర్ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పేటలో నివాళులర్పిస్తున్న జడ్జిలు శ్రావణి, శోభారాణి, న్యాయవాదులు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు

నందిగామ టౌన్: ఆత్మవిశ్వాసమే ఆయుధంగా కులం పొరల్ని ఛేదించుకొంటూ రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగిన మహోన్నతవ్యక్తి మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కొనియాడారు. స్థానిక బస్టాండ్ సమీపంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ విద్యావేత్తగా, మచ్చలేని నిస్వార్థనాయకునిగా పేరుప్రఖ్యాతలు సంపాదించుకున్నారన్నారు. వ్యవసాయమంత్రిగా హరితవిప్లవాన్ని సాకారం చేసి భారత ఆహార గిడ్డంగులను ఏర్పరచిన దార్శనికుడని కొనియాడారు. రైల్వేమంత్రిగా బ్రిటీష్ కాలం నాటి రైల్వే వ్యవస్థను ఆధునీకరించేందుకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, కౌన్సిలర్ షేక్ యాకుబ్‌అలీ, వార్డు కన్వీనర్ మహ్మద్ అమీన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు షేక్ కరిముల్లా, మన్నెం దాసు, వీసం దుర్గారావు, షేక్ ఫాతిమ, బండారు గంగమ్మ, విజయ, వడ్డెల్లి సాంబశివరావు, పిల్లి జయరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27ఏళ్లకే ఎమ్మెల్యేగా గెలుపు..

27ఏళ్ల చిన్న వయస్సులోనే బీహార్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా అడుగుపెట్టిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉపప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ, ఆహార, కార్మిక, ఉపాధిశాఖమంత్రిగా జగ్జీవన్‌రామ్ ప్రజలకు ఎంతో సేవచేశారని వివరించారు. నాయకులు బండారు గంగమ్మ, విశ్వనాథపల్లి కృష్ణారావు, సూరె రామారావు, బాపట్ల సాంబయ్య, పత్తిపాటి జయరామారావు, మందా మరియమ్మ, వేల్పుల రమేష్, పెసరమల్లి శేఖర్, పిల్లి జయరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మక్కపేటలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చందర్లపాడులో..

మండలంలోని ఆయా గ్రామాల్లో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చందర్లపాడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ఎస్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆర్డీవో ఎ.రవీంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్డీవో కార్యాలయ ఏవో రామకృష్ణ, నందిగామ, వీరులపాడు తహసిల్దార్లు వై.సరస్వతి, కె.రాజాకిషోర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. దేశానికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు.



అనిగండ్లపాడు అంగన్‌వాడీకేంద్రంలో నివాళులస్తున్న అంగన్‌వాడీలు, గ్రామస్తులు

వత్సవాయి మండలంలో..

మక్కపేట(వత్సవాయి): మండలంలోని మక్కపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రాం విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పాపట్ల ప్రసాద్, యంద్రాతి బాబురావు, నాగభూషణం పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా డాక్టర్ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పేదల అభ్యున్నతి కోసం మాజీఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ తన జీవితాన్ని అంకితం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలన దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ముదిరాజ్ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాపల వెంకటేశ్వర్లు, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బద్దూనాయక్, పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి రాంబాబు, కౌన్సిలర్ పందుల రోశయ్య, ఎస్సీసెల్ నాయకులు ఇరుగు రవీంద్ర, ఉప్పెల్లి పెంటయ్య, గోగుల వెంకయ్య, అల్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యాలయంలో..

స్థానిక కోర్టు ఆవరణలోని పేట బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు అధ్యక్షతన జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి ముఖ్యఅతిథులుగా హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించినవారిలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డి.సంతోష్, న్యాయవాదులు మార్కపూడి నాగేశ్వరరావు, దాసరి నాగేశ్వరరావు, జుజ్జవరపు వెంకట్రావు, పారా రామారావు, జె.అశోక్‌కుమార్, వెంకటరాజు, అన్నెపాగ కిషోర్‌బాబు, వేల్పుల జ్ఞానరత్నం ఉన్నారు. అదేవిధంగా బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత, ఉపాధ్యాయులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని ఎంపీపీ కోటేరు లక్ష్మి కొనియాడారు. మండలంలోని జుజ్జూరులో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొణతాలపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పేటలో నివాళులర్పిస్తున్న వెంకటకృష్ణప్రసాద్, ఇంటూరి చిన్నా, ప్రభాకర్, నాయకులు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, తహసిల్దార్లు



కంచికచర్ల గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, పాఠకులు



గురుకుల పాఠశాలలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

క్లుప్తంగా

రామ్‌కోలో ముందస్తు ఉగాది వేడుకలు



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట):గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరప్పాడుతండ, రావిరాల, జయంతిపురం, కెఅగ్రహారం, బూదవాడ గ్రామాలకు చెందిన పెద్దలను ఘనంగా సత్కరించారు. వారికి నూతన వస్త్రాలు, స్వీట్లు బహూకరించారు. అనంతరం కంపెనీ ప్రెసిడెంట్ ఆషిష్ కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ ఉగాది పండుగ అందరి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కంపెనీ ప్రతినిధులు ఫరూక్ మహ్మద్, రామకృష్ణ సాయి, హెచ్‌వోడీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎండల తీవ్రత



నందిగామ:భానుడు రోజురోజుకు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. నందిగామ ప్రాంతంలో కొద్దిరోజులుగా ఎండలు మండుతున్నాయి. గతేడాది ఏప్రిల్ మొదటివారంలో 39 డిగ్రీల వరకు ఉన్న పగటి ఉష్ణోగ్రతలు, ఆసారి 42 డిగ్రీలకు చేరుకున్నాయి. నందిగామలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు 42.3 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఒక్కరోజు వ్యవధిలోనే రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఎండలు మండుతుండటంతో మిడిల్ క్లాస్ ఏసీగా భావించే కూలర్లకు డిమాండ్ పెరిగింది. నందిగామ మార్కెట్లో వారం రోజులుగా కూలర్ల అమ్మకాలు పెరిగాయని వ్యాపారులు తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



వెంకటాపురం(పెనుగంచిప్రోలు):మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట కాలువల పూడికతీత, కంప చెట్లు తొలగింపు, ఫారం పాండ్స్ తదితర పనులను చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు, ఉదయం 10గంటల కల్లా పనులు నిలిపివేస్తున్నట్లు ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

పెనుగంచిప్రోలు: గతనెల 30వతేదీన పెనుగంచిప్రోలులో కత్తుల దాడి ఘటన చోటచేసుకోవడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో పోలీసులు ప్రత్యేక పహారా కాస్తున్నారు. పోలీసు పికెట్‌ను నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ పి రాంబాబు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగుతోంది.

ఇన్‌కం ట్యాక్స్ రిటర్నులు దాఖలు చేయాలి



కంచికచర్ల : ఇన్‌కంటాక్స్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ పెన్షనర్లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి తప్పనిసరిగా ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ దాఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ ఎంప్లాయిస్‌తో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రిటర్నులు దఖలు చేయనివారు పెనాల్టీ చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఆ పరిస్థితి రాకుండా ఇన్‌కంట్యాక్స్ రిటర్నులు దాఖలు చేయాలని సూచించారు. విజయవాడ మాక్సివిజన్ ఐ సూపర్‌స్పెషాలిటీ వైద్యులు సంఘ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. నలుగురికి కాటరాక్ట్ ఆపరేషన్ చేయాలని నిర్ధారించినట్లు వివరించారు. సంఘ నాయకులు ముండ్లపాటి పోతురాజు, చలసాని నాగేశ్వరరావు, బీవీ కృష్ణమూర్తి, చాపలమడుగు స్వర్ణలత, అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి..అండగా ఉంటాను

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ ఆరోవార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రానున్న ఎన్నికల్లో నందిగామ నియోజకవర్గ ప్రజలు తనను మరోసారి ఆదరించి గెలిపించడం ద్వారా అభివృద్ధికి అండగా నిలవాలని ఎమ్మెల్యే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. పట్టణంలోని ఆరోవార్డు పరిధిలోని బస్టాండ్, యాదవబజార్, చందమామపేట, పెద్ద మసీదు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆరోవార్డు ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

డ్రెయిన్‌పై వాక్ వే నిర్మాణం..

ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నందిగామ ప్రజలకు కనీస అవసరాలు, వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిచ్చినట్లు తెలిపారు. ఆరోవార్డు యాదవబజార్ సమీపంలో ఇళ్లమధ్య నున్న మురుగుకాల్వ నుంచి వచ్చే దుర్గంధం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, రూ.50లక్షలతో డ్రెయిన్‌ను ఆధునీకరించి వినూత్నరీతిలో వాక్‌వే నిర్మాణం చేపట్టామని వివరించారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాదిరిగా తనవద్దకు వచ్చేందుకు అపాయింట్‌మెంట్‌లతో పనిలేదన్నారు. ఎవరైనా ఎప్పుడైనా వచ్చి తనను కలిసే వెసులుబాటు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు షేక్ యాకుబ్ అలీ, వార్డు కన్వీనర్ ఎండీ అమీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, షేక్ కరిముల్లా, బండారు గంగమ్మ, షేక్ ఫాతిమా, షేక్ జాఫర్, షేక్ మున్నా, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పోతురాజు, వైఎస్ఎన్ ప్రసాద్, ఓర్సు జ్వాలా, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేలు జరిగితేనే ఆశీర్వదించండి

ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిదంటేనే తమపార్టీని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్ ప్రజలను కోరారు. కంచికచర్లలోని అంబేద్కర్‌నగర్, అరుంధతీనగర్‌లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో కూటమి తరఫున ఓ డమ్మీ అభ్యర్థి బరిలో ఉండగా, వైఎస్సార్ సీపీ తరఫున నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పోటీచేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావును మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, పార్టీ మండల అధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, నాయకులు అమర్లపూడి యోహాన్, షేక్ రజీమ్, మేడిద బాబూరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గండేపల్లి, పేరకలపాడు గ్రామాల్లోని నాయకులతో గురువారం రాత్రి ఎమ్మెల్సీ అరుణకుమార్ సమావేశం నిర్వహించారు. పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, ఉపసర్పంచి బి.వి. సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, నాయకులు చింతా రవీంద్రనాథ్, మట్టా చంద్రశేఖరరెడ్డి, కె.రంగారావు, ఎం.ఏసుపాదం, పిల్లి రమేష్, సంఘం దేవరాజు, తలమాల కిషోర్, రామారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథా గానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన హరికథా గానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడ గుడిపాటి కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గుడిపాటి జయరామసుధాకర్ యాగరక్షణపై హరికథా గానం చేశారు. జయరామ సుధాకర్‌కు వయోలిన్‌పై డాక్టర్ పాణ్యం దక్షణామూర్తి, మృదంగంపై కె. జగన్మోహని సహకారం అందించారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన హరికథా గానాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం హరికథా గానం చేసిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తేనే పేదలకు మంచి జరుగుతుందని విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభానును గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 30వవార్డు ఎర్రకాలువ కట్ట ప్రాంతంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలులను వివరించారు. జగ్గయ్యపేటను అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఉదయభానును మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

8 నుంచి నూకాలమ్మ జాతర

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం సమీపంలోని శ్రీనూకాలమ్మ జాతర మహోత్సవాలు ఈనెల 8వతేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 8వ తేదీ ఉదయం 9గంటలకు కలశస్థాపన, 9తేదీ అమ్మవారికి సన్నిధిలో విశేష కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. 10నుంచి 19వతేదీ వరకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. 20వతేదీ నదీజలాలతో ఊరేగింపు, 21న అమ్మవారి సంబరం జరుగుతుందని వివరించారు.భక్తులు హాజరుకావాలని కోరారు.

గోళ్లమూడిలో పోలీసు కవాతు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హనీష్

నందిగామ: ప్రతి ఓటరు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని గోళ్లమూడిలో శుక్రవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా హనీష్ మాట్లాడుతూ ప్రజలలో ధైర్యాన్ని నింపి నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడటమే పోలీసు కవాతు ముఖ్యోద్దేశమన్నారు. వివాదాలకు తావులేకుండా ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఘర్షణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ దుర్గామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పెనుగంచిప్రోలు: మండలంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లోని సచివాలయాలకు వచ్చి పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వలంటీర్లు ఇంటి వద్దనే పింఛన్ అందించగా, టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ పరిస్థితి దాపురించిందని పింఛన్‌దారులు మండిపడుతున్నారు. సచివాలయాలకు వచ్చిన పింఛన్‌దారులకు సిబ్బంది పింఛన్ పంపిణీ చేస్తున్నారు. మండలంలో శుక్రవారం సాయంత్రానికి 90శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారికి శనివారం పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు వివరించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామసచివాలయాల్లో శుక్రవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఇప్పటివరకు మొత్తం 93 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. మిగిలినవారికి శనివారం పింఛన్‌ను అందజేస్తామని ఆమె వివరించారు.

పని మానుకోవాల్సి వచ్చింది...



పింఛన్ సొమ్ము కోసం కూలి పని మానుకుని వెళ్లాల్సి వచ్చింది. వలంటీర్ల ద్వారా సాఫీగా సాగుతున్న పింఛన్ విధానాన్ని చంద్రబాబు నాశనం చేశాడు. టీడీపీ హయాంలో మాదిరిగా మళ్లీ పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాయాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. పింఛన్ కోసం ఎవరి ఎన్ని ఇబ్బందులు పెట్టినా మా మద్దతు సీఎం జగన్‌కు ఉంటుంది.

– పుల్లయ్య, కె.పొన్నవరం

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు : ఏసీపీ



పరిటాలలో మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్

పరిటాల(కంచికచర్ల) : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ కోరారు. మండలంలోని పరిటాల గ్రామసచివాలయం వద్ద వివిధ రాజకీయపార్టీల నాయకులతో శుక్రవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ పోలింగ్ రోజున ఓటుహక్కును ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే సహించేదిలేదన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేవారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎస్ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, హేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, యద్దనపూడి విజయరావు, మార్త శ్రీనివాసరావు, వేమల నాగరాజు, వేముల శ్రీకర జీవరాజు, గ్రామమాజీసర్పంచి తంగిరాల పద్మావతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు నెమలపురి అమ్మారావు పాల్గొన్నారు.